

శ్రీమతి శ్రీధర జయలక్ష్మిదేవి

సాయంకాలము నాలుగున్నర అయేసరికి లేడి పిల్ల లాగ చెంగున యిల్లుచేరుకున్నది లక్ష్మి. గబగబ నీళ్ళ గదిలోకివెళ్ళి కాళ్ళు, చేతులు, ముఖము కడుక్కొని తువాలుతో తుడుచుకుంటూ "వదినా! వదినా పేరంటానికి వెళదామంటివే — జడ వెయ్యవూ" అన్నది లక్ష్మి. శాంత ఆమెచెక్కిళ్ళను ముద్దాడుతూ "ఎక్కడికైనా వెళ్ళటమంటె నీవు ఆకలి దప్పులుకూడ యుండవు—ముందుపోయి ఆ బల్లమీద పెట్టియున్న టిఫెనుతిని కాఫీ త్రాగిరా" అన్నది. ఆరుగంటలయేసరికల్లా వదినె, మరదళ్ళు తలలుదువ్వుకొని చక్కగా ముస్తాబై పేరంటానికి బయలుదేరపోతుండగా మూర్తి ఆఫీసునుండి యింటికివచ్చాడు.

"ఎక్కడికి శాంతా! బయలుదేరారు? —ఓహో పేరంటానికి కాబోలు!" అంటూ లక్ష్మి రెక్కల క్రింద చేతులుంచి పట్టుకొని గిరగిర నాలుగుచుట్లు త్రిప్పి బొమ్మను కూర్చోపెట్టినట్లు లక్ష్మిని కూర్చోపెట్టాడు.

నలిగిపోయిన పూలను, రేగినజుట్టును సవరించుకుంటూ "పోఅన్నయ్యా !— నాపూలన్నీ ఎలా రాలిపోయినవో చూడు !— నీ వెప్పుడూ యింతే" నంటూ బుంగమూతి పెట్టింది.

"అవును చిట్టీ— మీ అన్నయ్యకు యింటికివచ్చేసరికి ఆటలెక్కువైపోతాయి — ఇంట్లో యున్న కొంచెముసేపు నీతోటి, మురళితోటి ఆడుకోడం తప్ప మరేగొడవ పట్టదు" అంటూ మూర్తితో "ఏమండీ! అబ్బాయికి పాలడబ్బా యివ్వాళకూడ తేలేదు కదూ!"—

"అరరే...యిప్పుడు వెళ్ళి తెస్తాను" అని మూర్తి బయలుదేరపోబోయాడు.

శాంత అతనిని ఆపి "పోనీలెండి రేపుతేవచ్చు— బల్లమీద కాఫీ, ఫలహారం యున్నవి. మేము ప్లీడరుగారి యింటికి పేరంటానికి వెళ్ళివస్తాము—యిప్పటికే చాల ఆలస్యమయింది" అని వదినె మరదళ్లు వెళ్లిపోయారు.

మూర్తికి నూరు రూపాయలు జీతం. దాంతో మద్రాసునగరంలో కాపురం గడపడమంటే నలుగురు గల సంసారంలో ఎన్నెన్నో కష్టాలను, సమస్యల నెదుర్కొంటూ జీవయాత్ర సాగిస్తున్నారు. కాని శాంత విద్యాధికురాలు కాకపోయినా ఉత్తమ గృహిణి కావడం గొప్ప అదృష్టము. కష్టాలను సుఖాలను సమానంగాచూస్తూ తన భర్తకు, చిట్టిమురళికి సాధ్యమైనంతవరకు మనసు నొవ్వకుండా ఉన్నంతలో కుటుంబాన్ని గంభీరంగా నడ్పుకొని వచ్చేది.

లక్ష్మి, మురళి ఆడుతూ పాడుతూయుంటే ఆ దంపతులిద్దరు ఆనంద సౌభాగ్యాలతో దుఃఖాలనూ కష్టాలను మరిచిపోతుండేవారు.

ఒకరోజున బళ్ళోనుంచి రాంగానే లక్ష్మి శాంత దగ్గరకు పరుగెత్తి "వదినా నిన్నొకటి అడుగదలచుకున్నాను..."

"ఒకటేమిటి—పది అడుగు—నీకేంకావాలి"?

"వదినా! నాకు తల్లిలేదూ!"

"ఎవరన్నారమ్మా నీకు తల్లిలేదని! — నేనేగా నీకు తల్లిని."

"నాకు తెలుసులే—మా అమ్మ చనిపోయింది—నీవు వదినెవు"

"పిచ్చిపిల్లా! దేవుడు నాకిచ్చి నిన్ను, యీ అమ్మాయికి తల్లివి, వదినెవు అంతా 'నీవే' నని చెప్పాడు. అప్పటినుండి నిన్ను నేను పెంచుతుంటే నీవు నన్ను 'వదినె' అని పిలుస్తున్నావు" అనిచెప్తూవుంటే శాంత తన కండ్లనుండే గాలే నీళ్ళబొట్లు లక్ష్మి చూడకుండా యుండేందుకని తల మరొక వైపుకు త్రిప్పుకొని "చిట్టీ! పోయి మురళి గోడ్డుమీదికి వెళ్ళాడేమో చూడు — బండ్లు వస్తుంటాయి" అనేసరికి లక్ష్మి లేచి వెళ్ళగానే పమిటకొంగుతో కండ్లు తుడుచుకుంది. ఇలాగే లక్ష్మి అనేకసార్లు అడిగినప్పుడల్లా యదార్థం చెప్పితే పసి హృదయం బాధపడుతుందని అసలు విషయం చెప్పకుండా మరపిస్తుండేది.

ఒకనాడు భోజనాలదగ్గర మాటల ప్రస్తాపనలో ఎదురుగా గోడకు తగిలించియున్న తల్లిఫోటోను చూస్తూ "శాంతా! మా అమ్మ చనిపోయి యీ జనవరికి అప్పుడే మూడేళ్ళు నిండుతాయి. ఆమెయుండియుంటే మురళిని క్రింద దించుతుండేదేనా" అన్నాడు.

శాంత విచారంగా "నా దురదృష్ట మటువంటిది - నేను వచ్చి రాకముందే ఆమెను పంపేశాను" అన్నది.

ఈ మాటలు వింటున్న లక్ష్మికి ఏమి బోధపడకపోయినా బిక్క మొగముతో వాళ్ళతో పాటు కూర్చున్నది. ఉన్నట్లుండి "వదినా! — నీవు నాకు అమ్మవు — వదినెవు అవుతావు కదూ! — అయితే మా అన్నయ్యకు కూడ అంతేనా" అన్నది.

"కాదుచిట్టీ ... అ ... అ ... అంతే" నంటూ లక్ష్మి అమాయకత్వానికి తనలో తాను నవ్వుకున్నది.

మూర్తి "మీ వదినె నీకు, నాకు ప్రపంచానికంతా తల్లేలే! నీవు వెళ్ళి పండుకో" అన్నాడు లక్ష్మితో.

శాంత చిచ్చుకొడుతుంటే మురళి, వాడితోబాటు లక్ష్మి నిద్రపోయారు.

"ఇక లక్ష్మిదగ్గర ఏ గుట్టు దాగేటట్టులేదు. ఇంకా ఆరేళ్లు నిండలేదు.ఎంత ఊహ, తెలివితేటలండీ!"

"చిట్టి అంతా మా అమ్మపోలిక శాంతా! — పోలికలతోబాటు ఊహాపోహాలుకూడ ఆమెవే. మా అమ్మకు 10 ఏళ్ళప్పుడు పెండ్లి అయిందట. అప్పటి ఫోటో మా తాతగారియింట్లోయుంది. దాన్నిచూస్తే చిట్టిని చూడనక్కరలేదు."

"మనచిట్టికి అప్పుడే పెళ్ళిచెయ్యవద్దండీ! — పెద్ద చదువు చెప్పించి, దాంతోబాటు సంగీతం నేర్పాలి. తర్వాత దానికి నచ్చిన సంబంధము తెచ్చి వివాహం చెయ్యాలి. అంతేకాని అభంశుభం ఎరుగకుండా

పెండ్లిచేయడం నాకు సుతరాం యిష్టంలేదు" అన్నది శాంత.

"అబ్బో! ... పెద్ద ఎత్తులే ... మన స్థిమితానికి, మనమిచ్చే కట్నానికి ఏరికోరి అల్లుణ్ణి తేగలమా! — దాని పెళ్ళియీడు వచ్చేసరికి యిన్సూరెన్సుబాపతు రెండువేల రూపాయలుతప్ప మరేమీ యుండదు. మనము యిప్పుడు అసలే చాలీచాలని సంపాదనతో నెలకు 20, 30 రూపాయలయినా అప్పుజేయకుండా సంసారం గడువడంలేదు. ఇక మనము నిలువచేయకలిగేది శూన్యమన్న సంగతి తెలిసినదే" అన్నాడు మూర్తి.

"ఏమోలెండి! ... దాని అదృష్టం బాగుంటే మీకేవిధంగానైనా డబ్బురాగూడదా — చిట్టికి కోరిన వరుడు దొరకకూడదా" అన్నది శాంత. ఇలా మాట్లాడుకుంటూ నిద్ర పట్టించారు భార్యాభర్తలు.

లక్ష్మి నిద్రనుండి ఉలిక్కిపడిలేచి "వదినా! భయంగాఉంది" అంటూ తట్టిలేపింది.

శాంత లేచి "భయమెందుకు చిట్టీ! నేను నీ దగ్గరే పండుకున్నానుగా" అంటూ పైన చెయ్యివేసి పండుకుంది.

* * *

"ఏమండీ! రేపు చిట్టి పుట్టినరోజు — జ్ఞాపకముందా" అన్నది శాంత.

"అయితే ఏమిటంటావు? — యిప్పుడా నెలచివరి రోజులు — చేతిలో చిల్లిగవ్వయినా లేదని నీకు తెలియదా శాంతా!" అన్నాడు మూర్తి.

"బాగుంది — మనకెప్పుడూ యున్నవే యీ గొడవలు — పదండి వెళ్లివద్దాము" అన్నది శాంత.

మూర్తికి అదంతా అయోమయంగానున్నది. మారు మాట్లాడకుండా శాంతతోబాటు నగల దుకాణంలోకి వెళ్ళాడు. తన మెళ్లో మూడుపేటల గొలుసు షరాబు చేతికిచ్చి తూకం వెయ్యమన్నది. ఆ దుకాణం నాలుగుమూలలు కలయతిరిగి మామిడిపిందెల నెక్లెస్ ఒకటి, ఒకజతగాజులు తీయించి తూకంవేయమన్నది.

ఇదంతా చూస్తున్న మూర్తి విస్తుబోయి "ఏంపని శాంతా! యిది — నేను అదనంగా నీకు నగలు చేయించేది లేకపోగా ఉన్నదానిని..." అన్నాడు.

"అదేమిటండీ! అలాగంటారు-మీకు తెలియదు;" మీరూరక చూస్తూ నిలబడియుండండి! తర్వాత యింటిదగ్గర సావధానంగా మాట్లాడుకుందాము" అన్నది శాంత.

షరాబు తూకంవేసి "మీ గొలుసుకు యీ నెక్లెస్, గాజులు మారకంవేస్తే మీ చేతికి రు 50 లు వస్తవి" అన్నాడు.

"చూశారూ! ఒక్కనగకు బదులుగా రెండు నగలను ఏర్పరచాను; పైగా రేపు చిట్టి పుట్టినరోజు పండుగ దర్జాగా జరుపకల్గుతాము" అన్నది మూర్తిని చూస్తూ.

నగలకొట్టు యజమాని గాజులను, నెక్లెస్‌ను పెట్టెలలో పెట్టి మాచేతికిచ్చి, రూపాయలు 50 కూడ యిచ్చాడు.వానిని తీసికొని యిల్లుచేరాము.

మరునాడు చిట్టికి తలంటి నీళ్ళుపోసి, కుట్టించిన సిల్కుపరికిణి, జాకెట్టు తొడిగి, మామిడిపిందెల నెక్లెస్‌పెట్టి "ప్లీడరుగారి అమ్మాయికుందనీ, నీకు కూడ కావాలని అంటుంటివే — యిప్పుడు సంతోషమే కదూ" అన్నది. లక్ష్మి ఉబ్బి తబ్బిబ్బైనది. దర్జాగా లక్ష్మి పుట్టినరోజు పండుగ గడచిపోయింది.

లక్ష్మి మెళ్ళోని నెక్లెస్ చూచి "శాంత మహా యిల్లాలు! తన భర్తయొక్క కొద్ది ఆదాయంతో ఎంత పొదుపరితనంగా కుటుంబం జరిపితే బంగారం కొని నగలు చేయించకలుగుతుంది! — పాపం లక్ష్మికి తల్లిలేనిలోటు లేకుండా చూచుకొంటున్నది" అనుకొనేవారు యిరుగుపొరుగువారు.

దరిమిలా శాంతకు మరిద్దరు కుమారులు పుట్టినా లక్ష్మిమీద ప్రేమానురాగాలు తగ్గలేదు. లక్ష్మి 14వ ఏట స్కూలు ఫైనలు చదువుతుండేది. శాంతకుమాత్రం ఏలాగైనా లక్ష్మికి గొప్పసంబంధము మాట్లాడి పెండ్లి చేయాలని. కాని మూర్తి తన స్థిమితాన్ని మించిన శాంత పిచ్చిపిచ్చి పోకడలు ఒక్కొక్కప్పుడు చాల చీకాకు కలిగించేవి.

ఒకరోజున సాయంకాలం మూర్తి యింటికి రాగానే "ఏమండీ! పెళ్లిచేసిచూడు సినిమాకు వెళదామండీ" అన్నది.

లక్ష్మి అందుకొని "వదినెకు ఎప్పుడూ పెళ్ళి ముచ్చటే" అన్నది.

"మీ వదినె పల్లెపడుచుకదూ — చిట్టీ! — అంతకంటె మరింకేమి తెలుసు—ఎప్పుడూ పెళ్లిళ్లు, వ్రతాలు, నోములు, పప్పన్నాలు — పిల్లల్ని పెంచడం! — పట్నవాసం కాపురంకదాయనే అదురు, బెదురూ కూడ లేదు"

"ఏమిటండీ! అలాగంటారు—సినిమాకెళ్ళి ఆరు నెలలయిందికదా — యీ కాలంలో ఏడాదికి రెండు సినిమాలనైనా చూడకుండా కడకు మూడుకాళ్ళ ముసలమ్మలు కూడ యుండరు — పోనీ యిష్టంలేకపోతే యీ అనవసరపు ఖర్చు ఎందుకనరాదూ."

"నేను సినిమాకు రానువదినా! పరీక్షలు దగ్గరకు వస్తున్నవి - చదువుకోవాలి. పరీక్షలయ్యాక డాన్సు ప్రదర్శనానికి వెళ్తాను" అన్నది లక్ష్మి.

"బలేబాగుంది - మీరిద్దరు యీ సంసారానికి దాపరించినందుకనుకోవాలి! - డాన్సు లేదు గీన్సు లేదు - పోయి చదువుకో" అని గద్దించి మాట్లాడాడు మూర్తి.

లక్ష్మి గుడ్లనీరు గుడ్ల కుక్కుకుంటుంటే శాంతవచ్చి "చిట్టీ! మీ అన్నయ్య మాటలకేంలే - నేను పంపిస్తానుగా డాన్సుకు" అంటూ బుజ్జగించి వెళ్లిపోయింది.

అన్నయ్య చాలీ, చాలని ఆదాయంతో పడుతున్న యిబ్బందులు కష్టాలను చూస్తుండినది కాబట్టి అన్నయ్య కసిరినా బాధ అనిపించలేదు. అప్పటి నుండి తను అది కావాలి, యిది కావాలని తొందర చేయడం పొరబాటనే నిర్ణయానికి వచ్చింది.

కట్నకానుకలా యివ్వగలస్థిమితమూ లేదు. కాని శాంతకు మాత్రం లక్ష్మిని విద్యాధికుడు, రూపసి, సుఖన్నకుటుంబమువాడైన వరుని మాట్లాడి పెళ్ళి చేయాలని. మూర్తి నెత్తిన నోరు పెట్టుకొని యివన్నీ 'అందని మానిపండ్లని' శాంతకు చెప్పి చూచాడు. కాని ఆరునూరైనా, నూరు ఆరైనా తన పంతం నెగ్గించుకోవాలని కూర్చున్నది శాంత.

పరీక్షలయిపోయినవి. శాంత 15 రూపాయలు తెచ్చియిచ్చి "లక్ష్మి! తీసికొని డాన్సు చూడడానికెళ్ళిరామ్మా" అన్నది.

"ఎంత పిచ్చిదానివి వదినా! నేనొక్కతెనే 10 రూపాయలు ఖర్చుపెట్టి డాన్సు చూడ్డానికెళ్తానా! - నేనూరికనే అడిగానుకాని - సరేకాని రాత్రికి బియ్యంలేవుకదా నీవు యీ 15 రూపాయలు ఎక్కడనుండి తెచ్చావు" అన్నది.

శాంత ఏమి మాట్లాడలేదు.

"ప్రక్కయింటి లక్ష్మమ్మ దగ్గర తెచ్చావు కదూ! -"

"అవును బదులడిగి యిప్పించుకొని వచ్చాను. మొదటి తారీఖున తిరిగి యిచ్చేస్తే సరిపోతుంది" అన్నది.

"చాల బాగుంది" అని వదినె చేతిలోని 15 రూపాయలు తీసికొని పారిపోయి పొరుగింటి లక్ష్మమ్మకిచ్చి వచ్చింది.

తన పెండ్లిని గురించి వదినె పడుతున్న ఆరాటం, అన్నయ్య పడుతున్న చీకాకు అనుదినం గమనిస్తూనే యున్నది లక్ష్మి. మూర్తి గంతకు తగిన బొంతగా

తీసికొని వచ్చిన రెండు మూడు సంబంధాలను తిరుగ గొట్టేసింది.

ఆ రోజున ప్లీడరుగారి అమ్మాయికి వివాహ సంబంధము వచ్చింది. పిల్లను చూడడానికని తల్లి దండ్రులు, కానున్న వరుడు వచ్చారు. లక్ష్మినికూడ చూడడానికి రమ్మని తీసికొని వెళ్ళారు. వచ్చినవాళ్ళు కానున్న వధువును, వెంబడియున్న లక్ష్మినిచూచి మిగిలిన విషయాలను తర్వాత మాట్లాడుకుందామని చెప్పి వెళ్ళిపోయారు. తర్వాత వారం రోజులకు ప్లీడరుగారికి "మీ పెద్దమ్మాయికంటె ఆమె వెంబడి యుండిన చిన్నమ్మాయి మాకు నచ్చింది. ఆమెను మా అబ్బాయి కిచ్చేట్లయితే చేసికుంటాము" అని జాబు వ్రాశారు.

అది చూచేసరికి ప్లీడరుగారు నిర్విణ్ణుడైనాడు. అయినా చేసేదిలేక మూర్తికి ఆ విషయం తెలియజేశాడు. అదివిని శాంత ఉప్పొంగిపోయింది. కాని ఆ సంబంధమా గొప్పది - కట్నకానుకలా అలివి మాలినవి. మూర్తికి ఏమిచేయడానికి తోచలేదు. శాంత మాత్రం తన అన్నగారి యూరికి వెళ్ళివస్తానని బయలుదేరి వెళ్ళింది.

తనకు తండ్రి వ్రాసి యిచ్చిన నాలుగెకరాల పొలమును అన్ననే తీసికొని 10 వేల రూపాయ లివ్వవలసినదిగా ప్రాధేయపడింది. అన్న ఎంతో చెప్పి చూచాడుకాని పట్టువదలలేదు. సరేనని పదివేల రూపాయలివ్వడానికి అంగీకరించారు.

సంబంధము నిశ్చయముచేసికొని రమ్మని మూర్తిని పంపింది. 10 వేల రూపాయల కట్నకానుకలతోటి, యిన్స్యూరెన్సు బాపతువచ్చిన 2 వేల రూపాయల చిల్లరతోటి లక్ష్మి పెండ్లి వైభవంగా జరిగింది. లక్ష్మికి ఏకొరతలేకుండా అత్తగారి యింటికి పంపబడింది.

లక్ష్మి అత్తింటివాళ్లు గొప్ప స్థిమితం కలవారైనా క్రమేణా లక్ష్మి పుట్టింటివారు దరిద్రులని, నడతలు, లాంఛనాలు సరిగ్గా జరుగలేదని దెప్పసాగారు. లక్ష్మి యీ బాధను దినదినానికి భరించలేకపోయేది. ఈ విషయం అన్నయ్యకు జాబు వ్రాసింది. తన స్థిమితానికి మించినవారితో సంబంధ బాంధవ్యాలు చేసినందుకు చాల విచారపడ్డాడు. శాంత కుంగి కృశించిపోసాగింది. తనుపోయి చూచివద్దామనుకొంటుండగానే మూర్తివేసిన పజిలులో మొదటి బహుమానం యిరవై వేల రూపాయలు వచ్చినట్లు టెలిగ్రాం వచ్చింది. ఆ దంపతులకిక ఆనందానికి మేరలేదు.

లక్ష్మికి ఆ విషయాన్ని తెలియజేసి అనుకున్న దానికంటె ఎక్కువగా, ఘనంగా లాంఛనాలు, నడతలు జరుపగలమని గర్వపడ్డారు. లక్ష్మి ఆనందమే తన ఆనందముగా ఎంచిన శాంత ఆమెకు ఏకొరతలేకుండా తను, తన సంసారము సుఖంగా కాలక్షేపం చేయసాగింది.

——(౦)——

ఒక నౌకా శిక్షణాలయంలో తర్ఫీదు పొందుతున్న బాలుని ఒక వృద్ధ నౌకాదళాధిపతి "పెద్ద తుపానువస్తే ఏమిచేస్తావు" అని అడిగాడు.

"వెంటనే లంగరు వేస్తాను."

"ఇంకొక తుపాను వస్తేనో"

"మరొక లంగరు వేస్తాను."

"అయితే భయంకరమైన మరొక తుపాను చెలరేగితేనో"

"విశేషమేముందీ - మళ్లీ లంగరువేస్తాను."

"ఆపు - ఇన్ని లంగర్లు ఎక్కడినుండి తెస్తావు ?"

"ఇన్ని తుపానులను మీ రెక్కడినుండి తేగలిగారో లంగర్లనుకూడ అక్కడినుండే"